

మాట్లాడుతున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

## ఎందుకీ 'హైడ్రా'మాలు?

- హామీలు అమలు చేయలేకే డ్రామాలు
- పేదల జోలికొస్తే ఊరుకునే ప్రసక్తే లేదు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ధ్వజం

కరీంనగర్ విద్యానగర్, సెప్టెంబర్ 9 : అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోవడంతో, ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను దారిమళ్లించేందుకు కాంగ్రెస్ సర్కారు 'హైడ్రా' పేరిట డ్రామాలాడుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ధ్వజమెత్తారు. బీజేపీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొని మాట్లాడారు. కొన్ని రోజులుగా హైడ్రా వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే విశ్వాసం పోతున్నదని, సామాన్యులను కూడా ఇబ్బంది పెడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పొట్టకూటి కోసం వ్యాపారం చేసుకునే షాపులు, పేదల ఇండ్లను కూలుస్తున్నారని, ఇకపై ఇలా చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. హైడ్రా వ్యవహరిస్తున్న తీరు సరికాదని, అక్రమ భవనాలు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో కడుతున్న ఇండ్లకు పర్మిషన్ ఎందుకు ఇచ్చారని, ఇప్పుడెందుకు కూలుస్తున్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అతి తక్కువ కాలంలో ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటున్న పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని విమర్శించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగడి కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, బీజేపీ లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు ఆంటోనీరెడ్డి పాల్గొన్నారు.




ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్యకు గుర్తింపు పత్రాన్ని అందజేస్తున్న సింగరేణి సీఎండీ బలరాం

## ఏఐటీయూసీకి గుర్తింపు పత్రం

గోదావరిఖని, సెప్టెంబర్ 9: సింగరేణిలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీకి ఎట్టకేలకు గుర్తింపు పత్రం వచ్చింది. ఎన్నికలు జరిగి ఎనిమిది నెలల తర్వాత యాజమాన్యం అందజేసింది. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ సింగరేణిభవన్‌లో జరిగిన కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్‌కు సింగరేణి సీఎండీ బలరాం గుర్తింపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఏఐటీయూసీకి సింగరేణి యాజమాన్యం గుర్తింపు పత్రం ఇవ్వడంతో బాధ్యత తీరినట్లు కాదని, గని కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వైవీ రావు, ఎల్ ప్రకాశ్, కే స్వామి, కందుకూరి రాజారత్నం, ఆరెల్లి పోషం, 11 ఏరియాల యూనియన్ సెంట్రల్ ఆఫీస్ బేరర్స్, బ్రాంచ్ కార్యదర్శులు పాల్గొన్నారు.




తెలంగాణచౌక్ వద్ద నిరసన తెలుపుతున్న డాక్టర్లు

## నెల రోజులైనా న్యాయమేది?

కలకత్తా ఘటనపై వైద్యుల నిరసన

కరీంనగర్ విద్యానగర్, సెప్టెంబర్ 9 : కోలకత్తాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య జరిగి నెల రోజులైనా ఇప్పటి వరకు ఎలాంటి న్యాయం జరుగకపోవడంపై కరీంనగర్ వైద్యులు మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం కరీంనగర్‌లోని తెలంగాణచౌక్‌లో నిరసన తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసనలో సీనియర్ వైద్యులు సుహాసిని, శ్రీలతారెడ్డి, విజయలక్ష్మి, చంద్రమతి, ఎనమల్ల శ్రీదేవి, నయని, సాత్విక, రేఖారాణి, ఎషికశ్రీ, ఝాన్సీ, శేష శైలజ, హరికిషన్, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.



ఇల్లందకుంటలో నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

## రెండో విడుత నిధులు విడుదల చేయండి

దళితబంధు లబ్ధిదారుల నిరసన

ఇల్లందకుంట, సెప్టెంబర్ 9 : దళిత బంధు రెండో విడుత నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ దళిత బంధు సాధన సమితి ఆధ్వర్యంలో లబ్ధిదారులు ఇల్లందకుంట మండలకేంద్రంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ దళితబంధు రెండో విడుత నిధుల కోసం తొమ్మిది నెలలుగా నిరసనలు చేపట్టినా ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేకుండా పోయిందన్నారు. నిధులు మంజూరు చేయకుంటే దళితులందరం ఏకమై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళితబంధు సాధన సమితి సభ్యులు కోలుగూరి సురేశ్, రాజేశ్, కోలుగూరి నరేశ్, ఆకాశ్, భిక్షపతి, రక్షిత్, ప్రవీణ్, సరిత, అర్జున్ పాల్గొన్నారు.




వీణవంకలో గుంతలతో కరీంనగర్–జమ్మికుంట ప్రధాన రహదారి

## పనులు కావు.. ప్రయాణం సాగదు

వీణవంక, సెప్టెంబర్ 9: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ నుంచి నర్సింగాపూర్ బస్టాండ్ వరకు ఫోర్‌లైన్ కోసం చేపట్టిన పనులు పూర్తి కాకపోవడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఈ రోడ్డు కోసం గత ప్రభుత్వం ₹28 కోట్లు మంజూరు చేయగా, రెండేళ్ల క్రితం పనులు ప్రారంభమయ్యాయి. సదరు కాంట్రాక్టర్ ఫోర్‌లైన్ రోడ్డు వేయడానికి తారు రోడ్డు తీసేసి మట్టిపోసి వదిలేశాడు. దీంతో చినుకుపడితే రోడ్డు మొత్తం బురదమయంగా మారి వాహనదారులు నరకం అనుభవిస్తున్నారు. ఇరువై మోరీల వద్ద కల్వర్టు నిర్మాణం పూర్తికాకపోవడంతో వర్షానికి ప్రవాహం ఎక్కువై ఏకంగా వాహనాల రాకపోకలే స్తంభించిపోతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

## మెరుగైన వైద్య సేవలందించాలి



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, పక్కన కలెక్టర్ పమేలా సత్పతి, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

- మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ విద్యానగర్, సెప్టెంబర్ 9: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ జనరల్ దవాఖానలో సోమవారం అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. దవాఖానలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దవాఖాన అభివృద్ధి కోసం దాతలు సహకరించాలని కోరారు. డ్రైనేజీ సమస్య, ఏసీలు, రిపేర్, ఆపరేషన్ థియేటర్ ఎక్విప్‌మెంట్, అంబులెన్స్‌లు, ఆర్వో ప్లాంట్లు, సిబ్బంది మందుల, డెడ్‌బాడీ ఫ్రీజర్ సమస్యల గురించి మంత్రి దృష్టికి సూపరింటెండెంట్ గుండా వీరారెడ్డి తీసుకెళ్లారు. మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో 150, జీజీహెచ్‌లో 350 పడకలు ఉండగా ఒక్కోసారి 700కి పైగా పేషెంట్లు ఉంటున్నారని తెలిపారు. పేషెంట్లకు అనుకూలంగా సిబ్బందిని ఇవ్వాలని, కొత్తగా నిర్మించిన వంద పడకలకు అనుమతి ఇవ్వాలని మంత్రిని కోరారు. పొన్నం వెంటనే స్పందించి 150ఏసీలు తాను ఇప్పిస్తానని, డ్రైనేజీతోపాటు ఇతర సమస్యలను 15రోజుల్లోగా పరిష్కరిస్తామని చెప్పారు. రోటరీ క్లబ్ వారు అందించే ఎక్విప్‌మెంట్ కోసం ₹9లక్షలు వెంటనే మంజూరు చేయాలని కలెక్టర్‌కు సూచించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, విజయరమణారావు, కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, ట్రైనీ కలెక్టర్, డీఎంహెచ్‌వో సుజాత, ఇన్‌చార్జి ఆర్‌ఎంవో డాక్టర్ నవీనా, ఐఎంఎ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాంకిరణ్, ఏడీ షమీమ్, ఇంజినీరింగ్ అధికారులు, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.



# మాఫీ చేయరు.. స్పష్టత ఇవ్వరు

రుణమాఫీపై కొనసాగుతున్న అస్పష్ట విధానం

- ఉమ్మడి జిల్లాలో లక్షకుపైగా రైతుల పరిస్థితి అగమ్యగోచరం
- బ్యాంకర్లు, వ్యవసాయ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామంటున్న బ్యాంకర్లు
- తమ వద్ద ఉన్న జాబితాలో పేరులేదంటున్న వ్యవసాయ అధికారులు
- అంతటా వెల్లువలా దరఖాస్తులు
- పరిష్కార మార్గాలు తెలియక అధికారుల అవస్థలు
- ఇంకా అందని కొత్త మార్గదర్శకాలు

**రైతు రుణమాఫీపై స్పష్టత కరువైంది. మాఫీ కాక.. సరైన సమాధానం రాక లక్షలాది మంది అన్నదాతల్లో ఆందోళన కనిపిస్తున్నది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఉదాసీన వైఖరి అవలంభిస్తున్నదనే విమర్శలు వెల్లువెత్తుతుండగా, రైతులు ఆగమవుతున్నారు. ఇటు బ్యాంకులు, అటు మండల వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రజావాణి నుంచి మొదలుకొని క్షేత్రస్థాయి వ్యవసాయ అధికారి వరకు కనిపించిన ప్రతి అధికారికీ దరఖాస్తులు ఇస్తూ దండాలు పెడుతూనే ఉన్నారు. మాఫీ అవుతుందా..? కాదా..? అన్నదానిపై ఏ ఒక్క అధికారి నుంచి స్పష్టత రాక బేజారవుతున్నారు. మాఫీ కాని రైతుల కోసం సర్వే చేస్తామన్న సర్కారు కేవలం రేషన్‌కార్డు సంబంధమైన సమస్యలకు మాత్రమే పరిమితం కావడం, ఇంకా దాదాపు 30 కారణాలతో మాఫీ కాని రైతుల పరిస్థితిపై నేటికీ స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తున్నది.**

కరీంనగర్, సెప్టెంబర్ 9 (నమస్తేతెలంగాణ ప్రతినిధి)/ శంకరపట్నం: కాంగ్రెస్ ప్రభుత్వం మూడు విడుతల్లో కలిపి ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 2,37,994 మంది రైతులకు ₹1,788.77 కోట్ల రుణమాఫీ చేసింది. నిజానికి క్షేత్రస్థాయి పరిస్థితులకు, రుణమాఫీ జరిగిన తీరుకు మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తున్నది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులు, వాటి ద్వారా వచ్చిన నీళ్లు, ముఖ్యంగా కాళేశ్వరం జలాలతో 2018 నుంచి 2023 మధ్య వ్యవసాయం పండుగలా సాగింది. సాగుతోపాటు రైతుల సంఖ్య కూడా బాగా పెరిగింది. ఆ లెక్కన చూస్తే.. ఉమ్మడి జిల్లాలో దాదాపు 7.50 లక్షల మంది రైతులు ఉండగా.. బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతుల సంఖ్య ఐదు లక్షలపైగా ఉన్నట్టు బ్యాంకుల వార్షిక ప్రణాళికను చూస్తే స్పష్టమవుతున్నది. ఆ లెక్కన దాదాపు ఐదు లక్షల మంది రైతుల వరకు రుణమాఫీ జరగాల్సి ఉన్నది. కానీ, ప్రస్తుత రుణమాఫీ చూస్తే 40 నుంచి 50 శాతం మంది రైతులకు కూడా జరగలేదు. ఒక్క కేడీసీసీబీ పరిధిలోనే సుమారు 40 వేల మందికిపైగా రైతులకు రుణమాఫీ వర్తించలేదంటే పరిస్థితి ఎలా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. జాతీయ బ్యాంకుల సంగతి చెప్పనక్కర లేదు. అంతేకాదు, కొన్ని గ్రామాల్లో 40 నుంచి 45 శాతం రుణ మాఫీ అయితే.. కొన్ని గ్రామాల్లో 50 శాతం జరిగింది.

### నా మాఫీకి ఎవరు బాధ్యత వహిస్తరు?

మాకు ధర్మారం శివార్ల ఎకరంన్నర పొలం ఉంది. మేం మొలంగూర్ బ్యాంకుల ₹88 వేల లోన్ తీసుకున్నం. రెండో లిస్టుల మా పేరు రాలేదని అడిగితే మూడో లిస్టుల వస్తది అన్నరు. మూడో లిస్టుల గూడా రాలే. బ్యాంకులకు పోయి అడిగితే తర్వాత వస్తది పో్ని అన్నరు. మళ్లా కొన్ని రోజులకు బ్యాంకుకు పోయి గట్టిగ అడిగితే వ్యవసాయ అధికారులను అడుగుండ్రని చేతులెత్తేసిన్రు. అక్కన్నుంచి వ్యవసాయ అధికార్ల దగ్గరకు పోయి అడిగితే ఇండియన్ బ్యాంకులో లోన్లు తీసుకున్నోళ్ల పేర్లు మా సిస్టంలో చూపిస్తలేదు. మా దగ్గరికి రాకుండ్రి అన్నరు. పనులు మానుకొని బ్యాంకోళ్లు, వ్యవసాయ అధికార్ల వద్దకు తిరుగుడుకే సరిపోతంది.



ఓసారి అందరం కలిసి పోయి గట్టిగ అడిగితే ఆధార్ కార్డుల తప్పై రాకపోయినా, రేషన్ కార్డు లేక రాకపోయినా, అన్ని ప్రభుత్వం క్లియర్ చేస్తదని, అందరు రైతులకు రుణ మాఫీ చేస్తమని చెప్పిన్రు. నాకు అన్నీ కరెక్టే ఉన్నయ్. అయినా, ఎందుకు మాఫీ కాదు. మేం వీళ్లు వాళ్ల సుట్టూ తిరుగుకుంట ఎక్కడ సావాలె. అసలు మాకు రుణమాఫీ అయితదా..? కాదా..? దీనికి ఎవరు బాధ్యత వహిస్తరో చెప్పాలె. కొందరికైతే లిస్టుల పేర్లు ఉన్నయి సరే.. పేర్లు ఉన్నోళ్లయి, లేనోళ్లయి అందరివైతే దరఖాస్తులు తీసుకుంటుండ్రు గానీ, మాకు మాఫీ అయినప్పుడే కదా మాలెక్క ఒడిసేది.

**- గట్టు శ్రీనివాస్, రైతు (కన్నాపూర్)**

### కొనసాగుతున్న అస్పష్ట విధానం

రుణమాఫీ కాకపోవడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరసనలు వ్యక్తమైన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొనడంతో ప్రభుత్వం మరోఎత్తుగడ వేసింది. మాఫీ కాని రైతుల వివరాలు సేకరించేందుకు ఇంటింటా సర్వే చేస్తామని ప్రకటించింది. అందుకోసం కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రభుత్వం చెప్పిన దాని ప్రకారం చూస్తే.. రుణమాఫీ కాని అందరి రైతులకు సంబంధించి సర్వే జరగాలి. కానీ, ప్రస్తుతం అందుకు భిన్నంగా సర్వే నడుస్తున్నది. కేవలం రేషన్‌కార్డు సంబంధమైన సమస్యల ద్వారా మాఫీ కాని రైతుల వివరాలు మాత్రమే సేకరిస్తూ.. మిగిలిన వారి వివరాలు పట్టించుకోవడం లేదు. వ్యవసాయ అధికారులకు ప్రభుత్వం పంపిన జాబితా కూడా కేవలం రేషన్‌కార్డు సంబంధ సమస్యలది మాత్రమే ఉన్నది. నిజానికి రుణమాఫీ కాకపోవడానికి 31 కారణాలున్నాయని స్వయంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ గుర్తించి ఆ వివరాలను గతంలోనే ప్రభుత్వానికి పంపింది. ఆ లెక్కన 31 అంశాలపై క్లారిటీ ఇస్తూ.. ఆ కారణాలతో రుణమాఫీ కాని రైతుల వివరాలను ప్రభుత్వం సేకరించాలి. కానీ, కేవలం రేషన్‌కార్డువి మాత్రమే సేకరిస్తున్నది. మిగిలిన 30 కారణాలతో రుణమాఫీ కాని వివరాలను ప్రభుత్వం సేకరించడం లేదు. దీంతో సదరు రైతులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయక తప్పడం లేదు. ప్రధానంగా లక్షలాది మంది రైతులకు నేటికీ మాఫీ ఎందుకు కాలేదో ఏ ఒక్కరూ స్పష్టత ఇవ్వడం లేదు. బ్యాంకుల వద్దకు వెళ్తే.. తాము ప్రభుత్వానికి జాబితా పంపించామని, మాఫీ ఎందుకు కాలేదో తమకు తెలియదని, అది తెలియాలంటే వ్యవసాయ అధికారులను కలువాలని చెబుతున్నారు. ఇదే విషయంపై వ్యవసాయ అధికారుల వద్దకు వెళ్తే.. తమ వద్ద జాబితాలో పేర్లు లేవని, మాఫీ ఎందుకు కాలేదో తాము చెప్పలేమంటున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో లక్షలాది మంది రైతులు ఆందోళన చెందుతున్నారు. కలెక్టర్ నిర్వహించే ప్రజావాణి నుంచి మొదలు.. క్షేత్రస్థాయి వ్యవసాయ అధికారి వరకు దరఖాస్తులు చేస్తూ దండం పెడుతున్నారు. మాఫీ చేయాలని కోరుతున్నారు.

### సమీక్షే కరువైంది

లక్షలాది మంది రైతులకు.. రుణమాఫీ జరగలేదని ఆధారాలతో సహా వెల్లడైనా.. దీనిపై ఒక సమీక్ష నిర్వహించి రైతులకు భరోసా ఇవ్వడంలో ఉమ్మడి జిల్లా మంత్రులు విఫలమవుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. రుణమాఫీ కోసం ఇప్పటికే చాలా చోట్ల ఆందోళలు, రాస్తారోకోలు జరిగాయి. ఇంకా చాలా చోట్ల నిరసనలు తెలుపుతూ.. బ్యాంకులను ముట్టడిస్తున్నారు. మాఫీ కోసం నేటికీ పోరాటం చేస్తూనే ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ఉమ్మడి జిల్లా మంత్రులు, ఒకసారి అధికార యంత్రాంగంతో సమీక్ష నిర్వహించాలి. అసలు రుణమాఫీ ఇంకా ఎంతమందికి కావాల్సి ఉన్నది? ఏ కారణాలతో వాళ్లకు కాలేదు? అందులో మాఫీకి అర్హులు ఎంత మంది ఉన్నారు? లోపాలు బ్యాంకుల వద్ద జరిగాయా..? లేక వ్యవసాయ అధికారుల వద్ద జరిగాయా..? ప్రస్తుతం వస్తున్న దరఖాస్తులను ఎలా పరిగణలోకి తీసుకోవాలి? వాటికి పరిష్కార మార్గాలు ఏమిటీ? అన్న వివరాలు తెలుసుకోవడంతోపాటు ఎప్పటిలోగా మాఫీ చేస్తారో ప్రకటించి.. రైతుల్లో భరోసా నింపాల్సిన అవసరమున్నది. కానీ, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ ఈ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. దీంతో రైతులకు ఎక్కడా భరోసా దొరక్క అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి ఏర్పడుతున్నది.

### లిస్టుల పేర్లు లేనోళ్లకు మాఫీ చేస్తరా లేదా?



మొలంగూర్ ఇండియన్ బ్యాంకు వాళ్లు తింపుకొని తింపుకొని ₹70 వేలు రుణం ఇచ్చిన్రు. దాంట్ల మేం 2014 నుంచి లోన్ తీసుకుంటున్నం. ఎప్పటికప్పుడు వడ్డీ కట్టి అప్డేట్ చేసుకుంటున్నం. మాకు రుణమాఫీ కాలేదు. ఎందుకు కాలేదని మేనేజర్‌ను అడిగితే తర్వాత అయితదన్నరు. వ్యవసాయ అధికార్లను అడిగితెనేమో ఇండియన్ బ్యాంకోళ్లు అంటేనే కసురుకున్నరు. గట్టిగ అడిగితే ఏదో ఉప్పోస మాటలు చెప్పవట్టిన్రు. దీంతో రైతులం అందరం ఏకమై ఆందోళన చేసినం. అధికార్లను గట్టిగా నిలదీసినం. ప్రభుత్వం ప్రకటన చేసిందని అన్ని కాగితాలు పట్టుకొని వ్యవసాయ ఆఫీసుకు వస్తే ఇప్పుడు వాళ్ల లిస్టులో మా పేర్లే లేవు. మావే కాదు, మా లెక్క వందల మంది పేర్లు లేవట! ఇప్పటికైతే దరఖాస్తులు తీసుకొని సల్లబరుస్తున్నరు. ఇప్పటికి లిస్టుల పేర్లు ఉన్నోళ్లైతే సరే.. మరి లిస్టుల లేనోళ్ల పేర్లు ఏ యాప్ల ఆన్లైన్ చేస్తున్రు. వాళ్లందరికీ మాఫీ చేస్తమని సర్కారు గట్టి హామీ ఇవ్వాలె.

**-పిన్రెడ్డి సంపత్‌రెడ్డి, రైతు (కన్నాపూర్)**

## హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాల, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ పార్టీకి, ఫిరాయింపు ఎమ్మెల్యేలకు చెంపపెట్టు లాంటిదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. శాసనసభా స్పీకర్ పార్టీలకు అతీతంగా నిష్పక్షపాతమైన నిర్ణయం తీసుకున్నప్పుడే ప్రజలు హర్షిస్తారన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన జారీ చేశారు. బీఆర్‌ఎస్ బీ ఫామ్‌పై గెలిచి కాంగ్రెస్ కండువా కప్పుకోవడం.. మళ్లీ ఆ పార్టీ నుంచి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేయడం కంటే నీచమైనది ఇంకేది ఉండదన్నారు. రాజకీయాల్లో విలువలు ఎటు పోతున్నాయో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నైతిక, రాజకీయ విలువలను కాపాడాల్సిన బాధ్యత స్పీకర్‌దేనన్నారు. ఫిరాయింపులపై న్యాయం కోసం కోర్టు మెట్లు ఎక్కాల్సిన రావడం బాధాకరమని పేర్కొన్నారు. స్పీకర్ నిర్ణయంపై యావత్తు తెలంగాణ ఎదురు చూస్తోందన్నారు. హైకోర్టు తీర్పుపై డివిజన్ బెంచ్‌కు వెళ్తామని, సుప్రీంకోర్టులో తేల్చుకుంటామని కడియం శ్రీహరి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. చేసిన తప్పును కప్పి పుచ్చుకోవడానికి కడియం కోర్టు తీర్పుపై కామెంట్ చేస్తున్నాడని మండిపడ్డారు. మంత్రి పదవి కోసమే రేవంత్‌రెడ్డి పక్కన దానం నాగేందర్ చేరాడని విమర్శించారు. ఇలాంటి నాయకులకు ఓటు వేసేటప్పుడు ప్రజలు సైతం ఆలోచించాలని సూచించారు.



# సిరిసిల్లకు 'పొంగల్' ఆర్డర్లు

- తమిళనాడు చీరెల తయారీతో నేతన్నలకు ఉపాధి
- దాదాపు వెయ్యి మందికి లబ్ధి

**నేతన్నకు చేతినిండా పని కల్పించాలన్న ఉద్దేశంతో గత కేసీఆర్ ప్రభుత్వం బతుకమ్మ చీరెల ఆర్డర్లు ఇచ్చింది. ఏటా ₹350కోట్ల మేర ఆర్డర్లతో కార్మికులకు అన్నివిధాలా అండగా నిలిచింది. అయితే కొత్తగా వచ్చిన ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్లకు స్వస్తి పలికింది. దీంతో వస్త్ర పరిశ్రమ ఎనిమిది నెలలుగా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. నాడు ఉపాధి కోసం ఇక్కడికి వలసవచ్చిన కార్మికులతో కిటకిటలాడిన పరిశ్రమ.. నేడు స్థానిక కార్మికుల వలసలతో వెలవెలబోతున్నది. ఈ క్రమంలో పని లేక పస్తులుంటున్న నేతన్నలకు తమిళనాడు ప్రభుత్వం చీరెల ఆర్డర్లతో కాస్త ఊరట కలిగింది. ఈ పొంగల్ కానుకగా ఇచ్చే చీరెల తయారీతో సుమారు వెయ్యి మంది కార్మికులకు ఉపాధి లభించనున్నది.**



సిద్ధమైన చీరెలు

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ): గత కేసీఆర్ ప్రభుత్వం బతుకమ్మ పండుగకు కానుకలు ఇచ్చినట్టే.. తమిళనాడు ప్రభుత్వం సంక్రాంతి (పొంగల్)కి మహిళలకు చీరలు, పురుషులకు లుంగీలు పంపిణీ చేస్తున్నది. సిరిసిల్ల నేతన్నల నైపుణ్యం గుర్తించిన తమిళనాడు ప్రభుత్వం, చీరల, లుంగీల తయారీ ఆర్డర్లను దాదాపు పదేళ్లుగా సిరిసిల్లకు ఇస్తూ వస్తున్నది. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా ఇచ్చింది. దాదాపు 30లక్షల చీరెల తయారీకి రెండు నెలల క్రితమే ఆర్డర్లు ఇచ్చింది. ఆంధ్రాకు చెందిన వ్యాపారి రామారావు ఆర్డర్లు తీసుకుని ఇక్కడి కార్మికులు, ఆసాములకు ఉపాధి కల్పిస్తున్నారు. దాదాపు వెయ్యి సాంచాలపై 5.50మీటర్లు ఉన్న చీరలు 150 రంగుల్లో తయారు చేస్తున్నారు. ప్రతిరోజూ 2లక్షల మీటర్ల వస్త్రాలు తయారు చేస్తూ.. ఎప్పటికప్పుడు తమిళనాడుకు తరలిస్తున్నారు. అక్కడే ప్రాసెసింగ్, ప్యాకింగ్ చేస్తున్నారు. ఈ చీరెల తయారీతో వెయ్యి మందికి ఉపాధి లభిస్తుండగా, ఈ ఆర్డర్లతో ఒక్కొక్కరికి ₹12వేల నుంచి ₹15వేల వరకు కూలీ వస్తున్నట్టు కార్మికులు తెలిపారు. ఉపాధిలేక ఇబ్బంది పడుతున్న తరుణంలో పొంగల్ చీరలు అండగా నిలిచాయని చెబుతున్నారు.

### కేసీఆర్ సర్కారే బాగుండె



కేసీఆర్ సర్కారు ఉన్నప్పుడే సిరిసిల్లలో సాంచాలు మంచిగ నడిచినయ్. బతుకమ్మ చీరెలే మాకు బతుకునిచ్చినయ్. చేతినిండా పనితో నెలకు మంచి కూలీ గిట్టుబాటయ్యింది. బట్టా పొట్టకు కొదువలేకుండె. సర్కారు పోయినంక బతుకుదెరువు భారమైంది. బతుకమ్మ చీరల ఆర్డర్లు రాక గోసపడుతున్నం. ఇప్పుడు ఆసాములు, సేట్లు అందరికీ పని లేకుండాపోయింది. పప్పులు, బియ్యం, కూరగాయలు కొనేందుకు ఇబ్బందిపడుతున్నాం. చిన్నప్పటి నుంచి సాంచాల పని జేసినోళ్లం. మరో పనిరాదాయే. కేసీఆర్ సార్ మళ్లీ వస్తనే మా బతుకులు బాగుపడతయి.

**- వంగలకొండ శ్రీనివాస్, మరమగ్గాల కార్మికుడు**



చీరెల నాణ్యతను పరిశీలిస్తున్న నేత కార్మికుడు

### సర్కారు మారింది.. మా బతుకులు ఆగమైనయ్



ఇన్నేళ్లు బతుకమ్మ చీరల పుణ్యమా.. అని చేతినిండా పని.. పనికి తగ్గట్టు కూలీ వచ్చేది. కేటీఆర్ సారు రకరకాల పథకాలు అమలుచేసి మాగోస తీర్చిండు. సర్కారు మారింది. మా బతుకులు ఆగమైనయ్.. బతుకమ్మ చీరలు బంద్ కావడంతో రోడ్డు మీద పడ్డం. ఇక్కడ పనిలేక చాలా మంది భీవండి బాట పడుతున్నరు. నెల రోజుల నుంచి తమిళనాడు చీరల ఆర్డర్లతో కాస్త ఉపాధి దొరికింది. మాకు శాశ్వత పరిష్కారం ఎవరు చూపిస్తలేరు. తమిళనాడులో సర్కారు చీరలు ఇచ్చినట్టే.. ఇక్కడ కూడా ఇయ్యాలె..

**- సిరిసిల్ల శ్రీనివాస్, మరమగ్గాల కార్మికుడు**